పదో తరగతి పరీక్షకు హాజరైన వీరస్వామి

కొడుకు పుట్టినరోజు నాడే తల్లి మృతి

ప్రజాశక్తి - ఆదోని

కొడుకు పుట్టినరోజు నాడే కన్న తల్లి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఆదోనిలోని ఇందిరానగర్‌లో చోటు చేసుకుంది. తల్లి మృతితో కొడుకు వీరస్వామి తల్లడిల్లారు. ఆర్‌టిసి డ్రైవర్ ఎం.రాజు భార్య జయశ్రీ అనారోగ్యంతో మూడురోజుల క్రితం నుంచి కర్నూలులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. తల్లి మృతదేహం ఇంట్లో ఉన్నా పదో తరగతి పరీక్ష ఉండడంతో దుఃఖంలో కూడా వీరస్వామి పరీక్ష రాసేందుకు భాష్యం స్కూల్‌కు చేరుకున్నారు. పరీక్షలు రాసి తల్లి దహన సంస్కారాలకు హాజరయ్యారు.

కాంగ్రెస్‌లోకి పలువురు నేతలు

- ఉమ్మడి జిల్లాలో పెరగనున్న బలం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

దేశంలో బిజెపి అనుసరిస్తున్న నిరంకుశ విధానాల పట్ల వ్యతిరేకతతో ఉన్న ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. రాష్ట్రంలో బిజెపితో జతకట్టిన టిడిపి, జనసేన పార్టీలు , అనైతికంగా మద్దతు తెలుపుతున్న వైసిపి పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాలు, 14 అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం లభిస్తుందని ఇండియా కూటమి భాగస్వాములు భావిస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు వ్యతిరేకత చూపారు. 2014 – 2019 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కలేదు. ఇప్పుడు బిజెపితో అంట కాగుతున్న తెలుగుదేశం జనసేన పార్టీలతోపాటు బహిరంగంగా మద్దతు ఇవ్వకపోయినా లోపాయకారి ఒప్పందం అధికార వైసిపికి ఉందని ప్రజలు భావిస్తున్నారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయించడంలో బిజెపి వైఫల్యం చెందింది. ఇప్పుడు మరోసారి బిజెపికి రాష్ట్రాన్ని అప్పగించేందుకు సిద్ధమైనటువంటి ఈ మూడు పార్టీల తీరును ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి ఫోరంతో పోటీ చేసేందుకు సిద్ధమయింది. సిపిఎం,సిపిఐ లతోపాటు ఇతర లౌకిక శక్తులు బలపరిచే పార్టీలతో కలిసి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నద్ధమయ్యారు. కాంగ్రెస్ పార్టీకి లెఫ్ట్ పార్టీలో మద్దతు కూడా లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇండియా కూటమి నుండి పోటీ చేసే అభ్యర్థులను కూడా బలపరిచే అవకాశాలున్నాయి. ఇటీవల కర్నూలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు పెద్ద ఎత్తున అభ్యర్థులు కూడా మొగ్గుచూపుతున్నారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దాదాపుగా 61 మంది అభ్యర్థులు పోటీ చేసేందుకు ముందుకు వచ్చారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 70 మంది పైగా దరఖాస్తులు చేసుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరుతున్న రామస్వామి (ఫైల్)

మొదలయిన చేరికలు: అధికార పార్టీకి చెందిన నందికొట్కూరు ఎమ్మెల్యే టి.ఆర్థర్, కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితోపాటు కర్నూలు జిల్లాలో సుదీర్ఘంగా క్రియాశీలక అధికారిగా పని చేసిన జాయింట్ కలెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేసిన రామస్వామి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. నంద్యాల అధికార పార్టీ జడ్‌పిటిసి గోకుల కృష్ణారెడ్డి వైసిపికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. టిడిపి, వైసిపిలో టికెట్ దక్కని సీనియర్లు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు.

కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్.షర్మిల (ఫైల్)

ఇంకా పెరిగే అవకాశం : జిల్లాపరిషత్ మాజీ అధ్యక్షులు బత్తిన వెంకట్రాముడు టిడిపిని వదిలి త్వరలో కాంగ్రెస్‌లోకి రానున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధికంగా అనేక నియోజకవర్గాల్లో దళితులు, మైనార్టీలు, బిసిలు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపనున్నారు. బిజెపి ప్రభుత్వం సిటిజన్‌సిఫ్ అమైండ్‌మెంట్ ఆక్ట్ (సిఎఎ) 19ను అమలు చేసేందుకు సిద్ధపడినందున ముస్లిముల నుంచి, లౌకికవాదుల నుంచి రాజ్యాంగస్ఫూర్తికి విఘాతం కలిగించే బిజెపికి దాని మిత్రపక్షాలకు ఈ ఎన్నికలలో ఎదురుదెబ్బ తగులనుంది.

వీధివీధినా భగత్ సింగ్ వర్ధంతి

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

విప్లవ కెరటం భగత్‌సింగ్ వర్థంతిని 23న వీధివీధినా నిర్వహించాలని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. కర్నూలు నగరంలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి. రాఘవేంద్ర వై.నాగేష్, జిల్లా నాయకులు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప నగర అధ్యక్షులు అమర్, నాయకులు యోగి మాట్లాడారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి 1931 మార్చి 23న ఉరి తీయబడ్డారన్నారు. నేటి యువతకు వారు ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవులు ఆనాడు భారతదేశన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుండి విముక్తి చేయడానికి వారు చేసిన కృషి విలువ అయిందని తెలిపారు. ఆనాడు ఉన్న విద్యార్థులు యువకులను స్వాతంత్ర పోరాటంలో పాల్గొనే లాగా చేయడానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించడానికి భగత్ సింగ్ వారి బృందమే ముఖ్యమైన పాత్ర పోషించిందని తెలిపారు. నేడు వారి స్ఫూర్తితో మతోన్మాదులను తరిమి కొట్టడానికి లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి విద్యార్థి యువజన కార్మిక ఇతర ప్రజా సంఘాలన్నీ కలిసి ముందుకు రావాలని కోరారు. శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు జిల్లావ్యాప్తంగా అన్ని వీధులు, గ్రామాల్లో నిర్వహించాలన్నారు. నగరంలో సాయంత్రం 6 గంటలకు జిల్లా పరిషత్ గాంధీ విగ్రహం దగ్గర జరిగే కొవ్వొత్తుల నివాళిలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ డాక్టర్ సృజన - ఆర్ఒలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన హెచ్చరించారు. శుక్రవారం ఎన్నికల అంశాలపై ఆర్ఒలు, మునిసిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సి.విజిల్ ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు దృష్టికి రావడంతో ఫిర్యాదుల పరిష్కారంలో బాధ్యతారహిత్యంగా ప్రవర్తిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడ్ ఉల్లంఘనకు సంబంధించి పత్రికల్లో వచ్చిన వార్తలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సువిధ యాప్ పనిచేయని పక్షంలో నోడల్ అధికారుల నుండి ఫిజికల్‌గా దరఖాస్తుకు తీసుకుని రిటర్నింగ్ అధికారులు అనుమతులు ఇచ్చే సమయంలో ఆన్‌లైన్ అప్లోడ్ చేయాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం, దరఖాస్తుల డిస్పోజల్, ఎంసిసి ఉల్లంఘనల కేసులు తదితర అంశాలపై సంబంధిత రిటర్నింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దు

ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పాణ్యం నియోజకవర్గ ఆర్ఒ, జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని వీకర్స్ కాలనీ, ఇందిరా గాంధీ కాలనీలలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. అనంతరం స్వీప్ అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో నచ్చినవారికి ఓటు వేసుకోవచ్చని అన్నారు. స్వీప్ (SVEEP) 'సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీని నిర్వహించామని అన్నారు. ఓటు హక్కు కలిగి ప్రతి ఓటరు తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా యువ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుని, ఓటర్లను చైతన్యపరిచి ఓటు వినియోగించుకునేలా చేసి పోలింగ్ శాతాన్ని పెంచాలని జాయింట్ కలెక్టర్ ఓటర్లకు పిలుపునిచ్చారు. కల్లూరు తహసీల్దార్ మునివేలు, బూత్ స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలుకు నాగరాజు.. నంద్యాలకు శబరి

- టిడిపి ఎంపీ అభ్యర్థులు ఖరారు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

శబరి

నాగరాజు

టిడిపి ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ అధిష్టానం తమ అభ్యర్థుల మూడో జాబితాను శుక్రవారం విడుదల చేసింది. కర్నూలు టిడిపి ఎంపీ అభ్యర్థిగా బస్తిపాటి నాగరాజును, నంద్యాల టిడిపి ఎంపీ అభ్యర్థిగా బైరెడ్డి శబరిని ప్రకటించారు. కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు ప్రస్తుతం కర్నూలు మండలం పంచలింగాల ఎంపిటిసి సభ్యునిగా ఉన్నారు. ఆయన గతంలో కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్‌గా పని చేశారు. సినీ రంగంలో పలు సినిమాలకు నిర్మాతగా కూడా వ్యవహరించారు. కర్నూలు ఎంపీ స్థానానికి టిడిపి నుండి పలువురు ఆశావహులు పోటీ పడ్డారు. వైసిపి తరపున కర్నూలు ఎంపీగా ఉన్న ఎస్.సంజీవ్ కుమార్ ఎంపీ పదవికి, వైసిపికి రాజీనామా చేసి చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. ఆయనను కర్నూలు టిడిపి ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేస్తారని వార్తలు వచ్చాయి. అదే స్థానం కోసం ఎమ్మెల్సీ బిటి.నాయుడు పేరు కూడా వినిపించింది. అయితే ఎట్టకేలకు ఆ పార్టీ అధిష్టానం కర్నూలు ఎంపీ అభ్యర్థిగా బస్తిపాటి నాగరాజు పేరును ఖరారు చేసింది. నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి కుమార్తె. ఆమె మొన్నటి వరకూ బిజెపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలిగా ఉన్నారు. ఇటీవల బిజెపికి రాజీనామా చేసి చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. ఆమె ఎంబిబిఎస్ విద్యను అభ్యసించారు. తొలుత నంద్యాల ఎంపీ స్థానాన్ని టిడిపి బైరెడ్డి రాజశేఖరరెడ్డికి కేటాయిస్తారని వార్తలు వచ్చాయి. ఆ పార్టీ అధిష్టానం ఆ స్థానాన్ని మహిళకు కేటాయించాలని నిర్ణయించడంతో చివరకు బైరెడ్డి శబరికి టికెట్ ఖరారు చేశారు.

ఆ స్థానాలపై వీడని ఉత్కంఠ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు, 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. టిడిపి తొలి జాబితాలో తొమ్మిది అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసింది. రెండో జాబితాలో మూడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. తాజాగా మూడో జాబితాలో రెండు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆదోని, ఆలూరు అసెంబ్లీ స్థానాలకు మాత్రం ఇప్పటి వరకు అభ్యర్థులను ఖరారు చేయలేదు. పొత్తులో భాగంగా ఆదోని టికెట్ ను బిజెపికి కేటాయించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆ స్థానానికి బిజెపి నుండి బిజెపి జిల్లా అధ్యక్షులు కునుగిరి నీలకంఠ గానీ బీసీ మోర్చా నాయకులు పార్థసారథి గానీ పోటీ చేయనున్నట్లు సమాచారం. ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా కోట్ల సుజాతమ్మ ఉన్నారు. ఇంటికి ఒకే టికెట్ కేటాయిస్తామని ఆ పార్టీ అధినేత చంద్రబాబు చెప్పడం, ఇప్పటికే డోన్ టికెట్ కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డికి కేటాయించడంతో కోట్ల సుజాతమ్మకు టికెట్ ఇవ్వరనే ప్రచారం సాగుతోంది. ఆ టికెట్ కోసం వీరభద్ర గౌడ్, వైకుంఠం సోదరులు పోటీ పడుతున్నారు. టిడిపి అధిష్టానం ఎవరికి టికెట్ కేటాయిస్తుందోనని టిడిపి నేతల్లో ఉత్కంఠ నెలకొంది.

శాలివాహన చక్రవర్తి జయంతిలో పాల్గొన్న జి.పుల్లయ్య, తదితర నాయకులు

వైభవంగా శాలివాహన చక్రవర్తి జయంతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అఖండ భారతావని సృష్టికర్త నవశకానికి నాంది పలికిన యుగ పురుషుడు శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలను నగరంలోని బిసిభవన్‌లో కర్నూలు జిల్లా శాలివాహన సంఘం అంగరంగ వైభవంగా నిర్వహించింది. శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షులు సోమేశ్ మాట్లాడుతూ శాలివాహన చక్రవర్తి నవశకానికి నాంది పలికారన్నారు. నేటికీ వాడుకలో శాలివాహన శకం ఉందని, అలాంటి వంశంలో పుట్టిన మన శాలివాహనులం గొప్పవారమని అన్నారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత పుల్లయ్య మాట్లాడుతూ శాలివాహన చక్రవర్తి శాతవాహన రాజులలో 23వ రాజు అని తెలిపారు. భారతదేశం ఆంతటిని పరిపాలించిన ఏకైక రాజుఅని అన్నారు. ఆయన తండ్రి శాతకర్ణి తరువాత రాజయ్యారని వివరించారు. శాతవాహన రాజులందరిలోకి గొప్పవాడిగా పేరొందాడని అన్నారు అశ్వమేధ యాగం చేసి రాజ్యాన్ని విస్తరించారన్నారు. అతని తరువాత శాలివాహనుడు రాజయినట్లు చరిత్ర చెబుతుందన్నారు. అప్పటికి రాజ్యమైతే విస్తరించింది కానీ శత్రుదేశాలనుండి ప్రత్యేకంగా శక్తులు, యవనుల వల్ల రాజ్యానికి ముప్పు కలిగే అవకాశం ఉండిందన్నారు.శ్రీశైల శాలివాహన నిత్య అన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, లింగన్న, నగర అధ్యక్షులు మధు, గుమ్మకొండ రమేష్ లక్ష్మన్న,ఎర్రబాడు వెంకటేష్, లలితమ్మ వెల్ఫేర్ కమిటీ లక్ష్మీదేవి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌కు వెంకటేశ్వర రెడ్డి చేయూత

ప్రజాశక్తి-మద్దికేర

రూ.3లక్షల చెక్కును అందజేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

మద్దికేరలో ఏర్పాటు చేస్తున్న కూరగాయల మార్కెట్‌కు శుక్రవారం మాజీ సర్పంచి కొత్తపేట వెంకటేశ్వర్‌రెడ్డి నాబార్డ్ అధికారులకు రూ.3 లక్షల విరాళాన్ని అందించారు. నాబార్డు నిధుల ద్వారా కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు మద్దికేర పంచాయతీ ముందుకు వచ్చింది. అందుకు సంబంధించి కాంట్రిబ్యూషన్ నిధులు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో వెంకటేశ్వర్ రెడ్డి రూ.3 లక్షలు ఇచ్చి చేయూతను అందించారు. వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ మద్దికేరలో కూరగాయల మార్కెటును రోడ్డుపై ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో ఇబ్బందికరంగా ఉండేదన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉండే సమస్యను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించేందుకు ముందుకు రావడంతో తన వంతు చేయూతను అందించానన్నారు. నాబార్డు అధికారి నరసింహులు జడ్‌పిటిసి మురళీధర్ రెడ్డి , తెలుగు యువత అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్, పంచాయతీ సలహాదారుడు బండారు అంజి, మాజీ ఉపసర్పంచి నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

కార్మిక సంఘాల జెండాలను తొలగించడం సరికాదు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలో కర్నూలు నియోజకవర్గం ఎన్నికల అధికారి అయిన మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ కార్మిక సంఘాల జెండాలను తొలగించడం అప్రజాస్వామికమని సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. కార్మిక సంఘాల సింబల్ సుత్తి కొడవలని, సిపిఎం సింబల్ సుత్తి కొడవలి నక్షత్రం అని ఎన్నికల నిబంధనలు అడ్డం పెట్టుకొని తేడా తెలుసుకోకుండా కార్మిక సంఘాల జెండాలు తొలగించడం విడ్డూరంగా ఉందని అన్నారు. కార్మిక సంఘాల నాయకులు బుధవారం కలెక్టర్‌కు భార్గవ్ తేజ నిర్వాకాన్ని కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల విభాగంలో వినతి పత్రం ద్వారా తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిని బట్టి సిపిఎం పట్ల పక్షపాత ధోరణి భార్గవ తేజ బయట పెట్టుకున్నారని అన్నారు. సిపిఎం జెండాలకు (సుత్తి కొడవలి నక్షత్రం) గుర్తు ఉండే ఫోళ్ళ కు ముసుగులు తొడిగినా మాకు అభ్యంతరం లేదని ఎన్నికల నిబంధనలను సాకుగా చూపి కార్మిక సంఘాల జెండాలను తొలగిస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్మిక సంఘాల జెండాలు , సిపిఎం జెండాలు కానీ ప్రజలను ప్రభావితం చేయగలవని అనుకుంటే ప్రభుత్వ కార్యాలయాలలో ఉండే ఫ్యాన్లు ఎన్నికల నిబంధనలను దృష్టిలో ఉంచుకొని తొలగించాలన్నారు. అదేవిధంగా రోడ్లపై సైకిళ్లను తిరగకుండా బ్యాన్ చేయాలని ఇవి కూడా ఎన్నికల గుర్తులేనని కమిషనర్ భార్గవ తేజకు గుర్తు చేశారు. కర్నూలు నగరంలో వివిధ పార్టీల జెండాలకు ముసుగులు తొడిగారే తప్ప తెల్లా పెయింట్ వేయలేదన్నారు. అన్ని పార్టీల పట్ల సమభావనతో మెలగాలని లేనిచో ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి అధికారులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని గుర్తు చేశారు.

ఓటే ఆయుధం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పత్తికొండ

ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం ఓటు అని, అలాంటి ఆయుధాన్ని ప్రజలందరూ కచ్చితంగా వినియోగించుకోవాలని పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి అన్నారు. శుక్రవారం పత్తికొండ ఎంపిడిఒ కార్యాలయంలో నీఓటు–నీ భవిష్యత్తు పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్‌డిఒ రామలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు అతి బలమైన ఆయుధమని దాని ప్రాముఖ్యత గురించి వివరించారు. మే 13న పోలింగ్ రోజు ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛాయుతంగా ఎవరికి భయపడకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. పోలింగ్ జరిగే ప్రదేశాల్లో ఏమైనా ఆటంకం జరిగితే వెంటనే సమీప అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ తహశీల్దార్ మాధవరావు, ఎంపిడిఒ రామారావు, ఎపిఎం మధు తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

అందరూ ఓటును వినియోగించుకునేలా అవగాహన

రిటర్నింగ్ అధికారి భార్గవ్ తేజ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజాస్వామ్యంలో రాజ్యాంగంలో కల్పించిన ఓటు హక్కు ఆయుధం వంటిదని, ప్రతి ఒక్కరిని తమ ఓటును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ పిలుపునిచ్చారు. శుక్రవారం కర్నూలు నగర పాలక సంస్థ నూతన కౌన్సిల్ హాల్‌లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్వీప్ సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్ కార్యక్రమం ద్వారా ఓటు హక్కు వినియోగం పై ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్లకు అవగాహన విషయం పై సమావేశం నిర్వహించారు. భార్గవ్ తేజ మాట్లాడుతూ ఇప్పటికి ఇంకా అర్హతగా ఉండి ఓటరుగా నమోదు చేసుకొని ప్రతి ఒక్క పౌరుడిని దరఖాస్తు చేసుకోనేలా చూడాలని తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్లకు స్వీప్ ద్వారా నిరంతరం ఓటు హక్కు పై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు ఓటు విలువ తెలియజేసేందుకు సాంస్కృతిక, కళాజాత, ముగ్గుల పోటీలాంటి చైతన్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. కేవలం ఓటర్లను తమ ఓటు హక్కును వినియోగించుకోవడంపై అవగాహన కల్పించాలని, ఉద్యోగులు ఫలానా పార్టీకో, ఫలానా గుర్తుకు ఓటు వేయండని చెప్పడం నేరమని చెప్పారు. రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాక ఎన్నికలకమిషన్ పిలుపుమేరకు “ఎన్నికల పర్వం..దేశం యొక్క గర్వం” అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, మెప్మా శాఖ పిడి నాగశివలీల, టిపిఆర్ఒ వెంకటలక్ష్మి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ మురళి, సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ పెంచలయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ

బత్తిన వెంకటరాముడు టిడిపికి రాజీనామా ?

కర్నూలు ఎంపి టికెట్ ఆశించి భంగపడ్డ బత్తిన

ప్రజాశక్తి-తుగ్గలి

కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి మండలం రామలింగయ్య పల్లె గ్రామానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి ,మాజీ జడ్‌పి చైర్మన్ బత్తిన వెంకట రాముడు టిడిపి రాజీనామా చేస్తున్నట్లు సమాచారం. టిడిపి కర్నూలు పార్లమెంట్ టికెట్ కోసం ఆయన ప్రయత్నించారు. టిడిపి ఎంపి టికెట్ పంచలింగాల నాగరాజు కు ఇవ్వడంతో బత్తిన వెంకటరాముడు తీవ్ర మనస్థాపనతో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ కోసం గత 20 ఏళ్లుగా పనిచేస్తున్నానని, పార్టీలో తగిన గుర్తింపు లేదని శనివారం తన అనుచరులు, మద్దతుదారులు, బంధుమిత్రులతో అన్నట్లు తెలుస్తోంది. కార్యకర్తలతో సమావేశం ఏర్పరచుకొని రాజీనామా చేస్తున్నట్లు సమాచారం.



ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న ఎంపి అభ్యర్థి నాగరాజు. బిటి.నాయుడు

బిటినాయుడును కలిసిన బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు కర్నూలు పార్లమెంట్ టిడిపి అభ్యర్థిగా బస్తిపాటి నాగరాజును ప్రకటించారు. ఈ సంధర్భంగా బస్తిపాటి నాగరాజు జిల్లా టిడిపి కార్యాలయంలో కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షులు బిటి నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి శాలువా వేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టిడిపి వ్యవస్థాపకులు సందమూరి తారకరామారావు విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. బస్తీపాటి నాగరాజు మాట్లాడుతూ బిసి సామాజిక తరగతులకు టిడిపి ప్రోత్సాహిస్తుందనడానికి నా పేరును తెలుగుదేశంపార్టీ కర్నూలు లోక్ సభ స్థానానికి ప్రకటించడంతో మరోసారి టిడిపి బిసిల పక్షపాతి అని రుజువు చేసిందని అన్నారు. నా ఎంపికకు సహకరించిన పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడుకు, ప్రదాన కార్యదర్శి నారా లోకేష్‌కు , రాష్ట్ర అధ్యక్షులు కె. అచ్చెన్నాయుడుకు, రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షులు కొల్లు రవీంద్రకు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎంఎల్‌సి బిటి. నాయుడుకు జిల్లా పార్టీ పెద్దలకు, ముఖ్యనాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ కురువ సాధికార కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మాజీ రాష్ట్ర కార్యదర్శి చిట్టాని అరుణ కుమారి, బిసి నాయకులు కురువ రామకృష్ణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అప్పారి ఆశయ సాధనకు కృషి

- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్

మాట్లాడుతున్న సురేష్ కుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

యుటిఎఫ్ ఉద్యమనేత అప్పారి వెంకట స్వామి ఆశయ సాధనకు కృషి చేస్తామని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక వీవర్స్ కాలనీ ఉన్నత పాఠశాలలో అప్పారి వెంకటస్వామి 24వ వర్ధంతిని జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.రామిరెడ్డి అధ్యక్షతన ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సురేష్ కుమార్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటిల్, పూర్వ జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప, జిల్లా కార్యదర్శులు దేవపాల్, నరసింహులు, ఆడిట్ కమిటీ సభ్యులు డి.కొలన్న మాట్లాడారు. 25 ఏళ్ల పాటు యుటిఎఫ్‌కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసి సంఘ సభ్యత్వాన్ని 7 వేల నుంచి లక్షకు పెంచడంలో వెంకటస్వామి కృషి అమోఘమని తెలిపారు. వ్యక్తిగతంగా అనారోగ్య సమస్యలు తలెత్తినా భయపడకుండా ముందుకెళ్లేవారని చెప్పారు. వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాజు, అల్లాబకాష్, చంద్రపాల్, ఎన్.నాగరాజు, ఎస్.ప్రసాద్, పాపయ్య, శివకుమార్, లక్ష్మన్న, విజయ్ కుమార్, రంగన్న పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగు

- వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి

విరుపాక్షిని, మారయ్యను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చిప్పగిరి

నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి, వైసిపి కన్వీనర్ జూటూరు మారయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని దౌల్తాపురం, నంచర్ల గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పర్యటించారు. ఆయన రాక సందర్భంగా వైస్ ఎంపిపి నరసింహులు, సర్పంచులు లక్ష్మీ దేవమ్మ, భీమ, వైసిపి సీనియర్ నాయకులు షేకన్న ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువాలు వేసి, బాణసంచా పేలుస్తూ స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని ప్రజలను కోరారు. వైసిపి ప్రభుత్వంలో దౌల్తాపురం, నంచర్ల గ్రామాల ప్రజలు అటు చిప్పగిరికి వెళ్లేందుకు రహదారి లేక చాలా అవస్థలు పడేవారని తెలిపారు. ఇప్పుడు ఇబ్బందులను తొలగించి రూ.12 కోట్లతో బిటి రోడ్డు వేస్తుండడంతో ఇరు గ్రామాల ప్రజలందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్రామాల్లో సమస్యలు లేకుండా అభివృద్ధి చేస్తామని తెలిపారు. పెద్ద షేకన్న, ఉప సర్పంచి హనుమంతు, సొసైటీ డైరెక్టర్ రామాంజిని, లింగన్న, శివ, పెద్దయ్య, నరేంద్ర పాల్గొన్నారు.

18వ వార్డులో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని 18వ వార్డులో ఏనుగుబాల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైసిపి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వేసవిలో దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఏనుగుబాల సత్యనారాయణ రెడ్డిని అభినందించారు. నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతుల్, వైసిపి పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు అబ్రార్, కౌన్సిలర్లు రంగమ్మ, కామర్తి నాగేశప్ప, ఇన్‌ఛార్జీలు సోమేష్, చంద్రశేఖర్, వడ్డే వీరేష్, సూరి, నాయకులు సచివాలయ కన్వీనర్ మధు, గోకారి, విశ్వహిందూ పరిషత్ ధర్మగుణ, మాల మహానాడు మురళీ కృష్ణ పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బుట్టా రేణుక

తాగునీటి సమస్య తీవ్రం...

- ఉప్పు నీటితో రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రమైంది. ఉప్పునీటిని తాగి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు.

మండంలోని మార్లమడికి పంచాయతీ మజారా గ్రామమైన ముద్దటమాగి, హెబ్బటం గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది. అత్యవసర సమయంలో ఉప్పు నీటిని వినియోగించుకోవడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. హొళగుంద, కడ్లేమాగి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. 15 రోజులకోసారి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఎండలు విపరీతంగా పెరిగాయి. ఎక్కడా నీటి లభ్యత లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎల్ఎల్‌సి కాలువలో నీరు ఉన్నప్పుడు నాలుగు కిలోమీటర్ల వరకు వెళ్లి తాగునీటిని తెచ్చుకునేవారు. ఎల్ఎల్‌సిలో నీరు లేకపోవడంతో పొలాల్లో ఉన్న బోరుబావుల దగ్గర నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామం ఏర్పడినప్పటి నుంచి ఎక్కువ శాతం ఫ్లోరైడ్‌తో కూడిన ఉప్పు నీటిని తాగడం వల్ల కీళ్ల నొప్పులు, వాంతులు, విరోచనాలతో రోగాలబారిన పడుతున్నారు. బళ్లారి, ఆదోని తదితర ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం కోసం డబ్బులను వెచ్చిస్తున్నారు. హెబ్బటం గ్రామంలో 4, 5 రోజులకోసారి నీటిని సరఫరా చేయడం వల్ల కుంట నీటిని తెచ్చుకొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామాలకు తాగునీటి సరఫరా విషయంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. వేసవిలో కూడా 'వచ్చామా.. వెళ్లామా..' అనే చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ఎల్ఎల్‌సిలో నీరు సమృద్ధిగా పారుతున్నప్పటికీ, వాటిని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు పంపిణీ చేసుకుని ఫిల్టర్ చేసి నీటిని సరఫరా చేయాల్సి ఉంది. ఆ దిశగా ఆలోచించకపోవడం వల్ల తాగునీటి సమస్య ఏర్పడిందని, మార్చి నెలలోనే ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలలో ఎలా ఉంటుందో అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ద్వారా నీటిని సక్రమంగా విడుదల చేయడానికి చర్యలు తీసుకుని నీటి ఎద్దడి లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముద్దటమాగిలో నీటి కోసం వెళ్తున్న గ్రామస్తులు

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

- ఎఇ రామ్‌లీలా

మండలంలోని హెబ్బటం, ముద్దటమాగి గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడింది. గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని ప్రజాశక్తి ఫోన్ ద్వారా ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామ్‌లీలాను వివరణ కోరగా... సమస్యను గుర్తించి వేసవిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని వివరణ ఇచ్చారు.

ఫ్లోరైడ్ నీటితో రోగాలు

- ముద్దటమాగి గ్రామస్తుడు నాగేంద్ర

తాగునీరు 15 రోజులకోసారి సరఫరా చేస్తున్నారు. ఫ్లోరైడ్ కూడిన బోర్ నీటిని తాగి రోగాల బారిన పడుతున్నాం. గ్రామం ఏర్పడినప్పటి నుంచి మాకు బోరు నీరే శరణ్యం. ఎస్ఎస్ ట్యాంకు ద్వారా సరఫరా నీరు మార్లమడికి గ్రామం నుంచి వస్తోంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల వారంలో కనీసం రెండుసార్లు కూడా రాకపోవడం బాధాకరం. అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి కొరత లేకుండా చూడాలి.

ఈతకు వెళ్లి బాలుడు మృతి

ప్రజాశక్తి - గోనెగండ్ల

పెళ్లికని తల్లిదండ్రులతో కలిసి వచ్చిన బాలుడు ఈతకెళ్లి మృతి చెందిన సంఘటన శుక్రవారం గోనెగండ్లలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... గోనెగండ్లలోని లక్ష్మీపేటలో జరిగే ఒక పెళ్లికి ఎమ్మిగనూరు మండలం మల్కాపురం గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి కుటుంబంతో పాటు వారి కుమారుడు అరుణ్ కుమార్(6) కూడా వచ్చాడు. కుటుంబ సభ్యులు పెళ్లి సందడిలో ఉండగా అరుణ్‌కుమార్ స్థానికంగా ఉండే కొంతమంది పిల్లలతో కలిసి సమీపంలోని ఎల్ఎల్‌సి కాలువకు ఈతకు వెళ్లాడు. తన తోటి పిల్లలు కాలువలో దిగి ఈత కొడుతుంటే తాను కూడా కాలువలో ఈతకు దిగి ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. గుర్తించిన పిల్లలు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి బాలుని కాలువ నుంచి బయటకు తీశారు. తల్లిదండ్రులు వెంటనే బాలుని గోనెగండ్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి సిపిఆర్ చేసినప్పటికీ అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యాధికారిణి డాక్టర్ రవళి తెలిపారు.

అభ్యర్థిపై అధిష్టానం పునరాలోచించాలి

- టిడిపి పెద్దకడబూరు, కోసిగి మండల నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం నియోజకవర్గ టిడిపి అభ్యర్థిత్వంపై పార్టీ అధిష్టానం పునరాలోచించాలని నియోజకవర్గంలోని పెద్దకడబూరు, కోసిగి మండలాల టిడిపి నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో పెద్దకడబూరు మండలం నెమలికల్, ముచ్చిగిరి, చిన్నకడబూరు, కోసిగి మండలం కామన్‌దొడ్డి గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్టీని నమ్ముకుని, పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేసిన తిక్కారెడ్డికే టిడిపి టికెట్ ఇవ్వాలని, కచ్చితంగా గెలిపించుకుంటామని తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశప్ప స్వామి, యువ నాయకులు మాధవరం కృష్ణమోహన్ రెడ్డి, తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, ఆర్‌టిఎస్ కన్వీనర్ దశరథ రాముడు, నెమలికల్ నరసింహులు, ముచ్చిగిరి దస్తగిరి, పులిగిరి నరసప్ప, కామన్‌దొడ్డి ఈరన్న, వీరేష్, దొడ్డయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ఎన్నిక కోసం నామినేషన్లు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. శుక్రవారం మొదటి రోజు ఆరుగురు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో ప్రెసిడెంట్ పదవి కోసం ప్రస్తుత అధ్యక్షులు అనితా బాయి, సుందర్ సింగ్ నామినేషన్లు వేయగా, వైస్ ప్రెసిడెంట్ పదవికి జనార్ధన్, జనరల్ సెక్రటరీ పదవి కోసం సురేష్ కుమార్, సురేంద్ర కుమార్, జాయింట్ సెక్రటరీ కోసం ఎస్‌వి.మల్లికార్జున, కోశాధికారిగా ఎఎమ్‌డి.లతీఫ్ అహ్మద్‌లు నామినేషన్ల దాఖలు చేశారని ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాదులు శ్రీరాములు, రామలింగ తెలిపారు.

బాలనాగిరెడ్డి గెలుపునకు కృషి

- వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మంత్రాలయం నియోజకవర్గం నుంచి మరోసారి ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి రెడ్డి గెలుపునకు కృషి చేయాలని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్నకడబూరులో వెలసిన శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలోని వైసిపి నాయకులు జాము మూకయ్య, మాధవరెడ్డి, నారాయణ, సర్పంచి అనసూయమ్మ, జడ్‌పిటిసి రాజేశ్వరి ఇళ్లకు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి బాలనాగిరెడ్డి గెలుపునకు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. గ్రూపు విభేదాలు పక్కనపెట్టి ప్రతి కార్యకర్త, నాయకుడు నిబద్ధతతో పని చేయాలని కోరారు. జెసిఎస్ కన్వీనర్ రవిచంద్ర రెడ్డి, గజేంద్రారెడ్డి, ఉరుకుంద ఈరన్న ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ విజయేంద్ర రెడ్డి, ముక్కరన్న, శివరాంరెడ్డి, ఆర్లప్ప, లక్ష్మన్న, నారాయణ, ఆంజనేయ, వీరేష్, నాగరాజు, సీతారాంరెడ్డి, మాధవరెడ్డి, హనుమంతు రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిబంధనలు ఉల్లంఘించిన
వాలంటీరుపై వేటు

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వార్డు వాలంటీరును విధుల నుంచి తొలగించామని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని 6వ వార్డు సచివాలయంలో పని చేస్తున్న కె.రవికుమార్ వాట్సాప్ గ్రూపులో వైసిపికి అనుకూలంగా, ఎన్‌డిఎకు వ్యతిరేకంగా వీడియో పోస్టు చేసి ప్రభావితం చేస్తున్నాడనే ఫిర్యాదుపై విచారణ జరిపి నిర్ధారణ కావడంతో విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, ఆప్కోస్ ఉద్యోగులు, వాలంటీర్లు, వివిధ శాఖల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న ప్రతి ఉద్యోగి ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాలని చెప్పారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధికి కృషి

- టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఈసారి టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని, అధికారంలోకి వచ్చాక అభివృద్ధికి కృషి చేస్తామని టిడిపి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని సోగనూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు అనుమంతు, మారయ్య, రాజు, పప్పు రాముడు, రాముడు, రంగన్న, బషీర్, వెంకటేష్, నరసప్ప, చాకలి నరసింహులు, చాకలి వీరేష్, రామలింగడు, వారి అనుచరులు సుమారు 100 మంది బీవీ సమక్షంలో టిడిపిలో చేరారు. టిడిపి సోగనూరు గ్రామ నాయకులు బోయ జగదీష్, బోయ రాఘవేంద్ర ఆధ్వర్యంలో వారు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో పిచ్చి తుగ్లక్ ఎలా ఉండే వాడో కేవలం పుస్తకాల్లో చదివి తెలుసుకున్నామని, ఇప్పుడు తుగ్లక్ పాలన ఎలా ఉందో జగన్మోహన్ రెడ్డి రూపంలో కళ్లారా చూశామని తెలిపారు. 2019 ఎన్నికల ముందు పెంచుతూనే పోతామంటే సంక్షేమ పథకాలు పెంచుతారని అనుకున్నామని, ప్రజల అవసరాల నిమిత్తం ఉపయోగపడే వస్తువులపై ధరలన్నీ పెంచి ప్రజల నడ్డి విరుస్తారని అనుకోలేదని వాపోయారు. అనంతరం వారికి బీవీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అభివృద్ధి కంటే మోసాలు ఎక్కువ చేసిందని విమర్శించారు. అందుకే టిడిపిలోకి వలసలు వస్తున్నారని, ఈసారి టిడిపి జెండా ఎగరేసే విధంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీవీ

వడదెబ్బ పట్ల అప్రమత్తత అవసరం

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

ఎండలు అధికమవుతున్న తరుణంలో వడదెబ్బ నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సూచించారు. శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వేసవిలో వేడి వల్ల చాలా మందిలో మైకం, భయం, వికారం వంటి లక్షణాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటికి వెళ్లకుండా పగటి పూట 12 నుంచి 3 గంటల వరకు ఇల్లు లేదా కార్యాలయంలో ఉంటే మంచిదని సూచించారు. ఇంటి నుంచి బయల్దేరే ముందు ఒక గ్లాసు నిమ్మరసం, చల్లని పాలు, మజ్జిగ, లస్సీ లేదా ఒక గ్లాస్ నీటిలో చిటికెడు ఉప్పు, రెండు టీ స్పూన్ల చక్కెర వేసి తీసుకోవాలన్నారు. తల, చెవులను కప్పుకున్న తర్వాత మాత్రమే ఇంటి నుంచి బయటకు వెళ్లాలని తెలిపారు. గొడుగు, వాటర్ బాటిల్, నిమ్మరసం ఉపయోగించుకోవడం ద్వారా శరీరం డిహైడ్రేట్ కాకుండా రక్షించుకోవచ్చు అన్నారు. ఈ సూచనలు పాటిస్తే వడదెబ్బ నుంచి ఉపశమనం పొందవచ్చని తెలిపారు.

వడదెబ్బ లక్షణాలు

కొంచెం మైకంతోపాటు తల తిరుగుతున్న అనుభూతి ఉంటుందని, ఏకాగ్రత ఉండదని తెలిపారు. బలహీనత, కండరాల నొప్పి, విపరీతమైన దాహం, కడుపులో తిప్పుతున్న అనుభూతి, వాంతులు, విరోచనాలు, అతిసారం ఉంటుందని చెప్పారు.

ముందు జాగ్రత్త చర్యలు

ఎండలో బయటకు వెళ్లేవారు టోపీలు, స్కార్ఫ్‌లు వాడితే మంచిదని, ప్రధానంగా మధ్యాహ్నం 12 నుంచి 5 గంటల వరకు బయటకు వెళ్లకపోవడం మంచిదని తెలిపారు. ప్రతి అరగంటకోసారి 300 మిల్లీలీటర్ల చొప్పున రోజుకు 5, 6 లీటర్ల నీటిని తగ్గకుండా తాగాలని సూచించారు. ఒఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, గ్లూకోజ్ నీరు తీసుకోవడం మంచిదన్నారు. విద్యార్థులు పరీక్ష సమయం కావడంతో ఎండ నుంచి దూరంగా ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. సాయంత్రం ఆడుకోవడం మంచిదని తెలిపారు. నూనె పదార్థాల వాడకం తగ్గించాలని, ఫ్రూట్స్, పండ్ల రసాలు తాగుతూ ఉండాలని సూచించారు. శరీరం లవణాలను కోల్పోకుండా ద్రవ పదార్థాలు తీసుకోవాలని, ఉప్పు వేసిన ద్రవాలు ఇవ్వాలని తెలిపారు. చెమటను గ్రహించే వదులైన కాటన్ దుస్తులను ధరించాలని, వేసవిలో శీతల పానీయాలకు బదులుగా మజ్జిగ, కొబ్బరి నీళ్లు తీసుకోవడం ద్వారా శరీరంలో లవణాలను కోల్పోకుండా జాగ్రత్త పడవచ్చని చెప్పారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

వైభవంగా మూగితాత ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలో కొలువైన శ్రీదీవానే మూగి తాత దర్గా ఉరుసు ఉత్సవాలు శుక్రవారం వైభవంగా దర్గా కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా దర్గా ప్రత్యేకంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం దర్గా కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామి వారి అశ్వాన్ని పూజారులు పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. స్థానిక సిఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ట్యాంకర్ ద్వారా ఉచిత మంచినీటి సరఫరా

దేవనకొండలో జరిగే మూగితాత ఉరుసు ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తాదుల దాహం తీర్చడానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ యువ నాయకులు పరమేష్ చేపట్టిన ఉచిత మంచినీటి ట్యాంకర్ సౌకర్యాన్ని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు మహేంద్ర నాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు మంచినీటి ట్యాంకర్ సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల సీనియర్ నాయకులు శ్రీనివాసులు, ఖాసీం, లక్ష్మన్న, బాష, కిరణ్, వంశీ, మోహన్ పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న డిసిసి ఉపాధ్యక్షులు మహేంద్ర నాయుడు

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అయినటువంటి సాలూరు గ్రామం కాపురస్తులు పి.బి.శ్రీనివాస్ తండ్రి లేటు సన్యాసిరాజు డోర్ నెం. 1-430 మక్కువ రోడ్డు వారు నాకు ఇచ్చిన భోగట్ట ప్రకారం తెలియజేయునది ఏమనగా సాలూరు మున్సిపాలిటీ పరిధిలో మక్కువ రోడ్డు డోర్ నెం. 1-430 కలిగిన భవనము మరియు ఖాళీ స్థలం నా క్లయింట్ యొక్క సొంత ఆస్తి అయి వారి సంపూర్ణ హక్కు అనుభవములో ఉన్నది. కాగా రీజినల్ మేనేజర్ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా కర్నూలు మరియు బ్రాంచి మేనేజర్ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధోని వారు ఎటువంటి చట్ట పరమైన రికార్డులు, ఆధారములు లేకుండా నా క్లయింట్ ఆస్తి వారి స్వాధీనములో ఉన్నట్లుగా ప్రజలను మభ్యపెడుతు తప్పుడు ప్రకటనలు చేయుటకు ప్రయత్నిస్తున్నట్టుగా నా క్లయింట్కు తెలిసినది. అటువంటి ప్రకటనలను నమ్మవద్దు అని, నా క్లయింట్ ఆస్తికి సంభందించి పైబ్యాంకు అధికారులతో ఎవరైన ఎటువంటి వ్యవహారములు జరిపినట్లయితే అందుకు వారే సొంత భాద్యత వహించవలయును. నా క్లయింట్కు ఎటువంటి సంబంధం ఉండదు అని తెలియజేయడమైనది.

సత్యవరపు శ్రీనివాసరావు
అడ్వకేట్,
మెయిన్‌రోడ్, సాలూరు,
సెల్: 9440143390

తేది: 22-03-2024.
సాలూరు

జల దినోత్సవం నిర్వహిస్తున్న విద్యార్థులు

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

- నీటిని పొదుపు వాడకంపై అవగాహన

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ జల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు నీటి పొదుపు వాడకంపై సైన్స్ ఉపాధ్యాయులు, నేషనల్ గ్రీన్ కోర్ ట్రైనర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన 'శాంతి కోసం నీరు' అనే ఇతివృత్తాన్ని వివరిస్తూ రాబోయే కాలంలో యుద్ధం అంటూ జరిగితే నీటి కోసమే జరుగుతాయని తెలిపారు. అటువంటి ప్రమాదం నుంచి బయట పడాలంటే నీటిని పొదుపుగా వాడుకొని ప్రతి ఒక్కరూ జల సంరక్షణకు పాటుపడాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతి నీటి బొట్టును కాపాడుకుందాం - జల సంరక్షణకు పాటుపడదామంటూ ప్రతిజ్ఞ చేయించారు.

స్వేచ్ఛాయుత వాతావరణమే లక్ష్యం : డీఎస్పీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

రానున్న ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించడమే కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్ కవాతు లక్ష్యమని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని హెచ్.కైరవాడి గ్రామంలో గోనెగండ్ల సిఐ రామకృష్ణయ్య, స్థానిక పోలీసు సిబ్బంది శశస్త్ర సీమాబల్ అసిస్టెంట్ కమాండెంట్ రాజేష్ ఆధ్వర్యంలో రెండు కంపెనీల ఎస్ఎస్‌బి కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు తగిన రక్షణ కల్పించి ప్రజల్లో భరోసా కల్పించడమే ఈ కవాతు లక్ష్యమని తెలిపారు. మండలంలోని గోనెగండ్ల, కున్నూరు, హెచ్.కైరవాడి గ్రామాలతో పాటు ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని 10 గ్రామాల్లో కవాతు నిర్వహించినట్లు చెప్పారు. నిబంధనలను ఉల్లంఘించి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

'సూపర్ సిక్స్'తో సంక్షేమం, అభివృద్ధి

- ఎంపిటిసి వెంకటేశ్వరమ్మ

ప్రజాశక్తి - నందవరం

టిడిపి సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి ఇల్లు సంక్షేమం, అభివృద్ధితో కళకళలాడుతుందని ఎంపిటిసి బోయ వెంకటేశ్వరమ్మ, టిడిపి మిట్టాసోమాపురం యువ నాయకులు బోయ వీరేష్ తెలిపారు. గురువారం మిట్టా సోమాపురం గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. సమస్యలు పరిష్కారం కావాలంటే టిడిపి అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఎమ్మెల్యే కావాలని తెలిపారు. టిడిపి నాయకులు లింగన్న, రామలింగడు, బొజ్జన్న, ఉరుకుంద, వీరేష్, వీరస్వామి, జయరాజు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ఎంపీ టికెట్‌పై సంబరాలు

ప్రజాశక్తి-ఆలూరు

టిడిపి కర్నూలు ఎంపీ టికెట్ బస్తిపాటి నాగరాజు (పంచాలింగాల)కు ఖరారు కావడంతో శుక్రవారం ఆలూరు అంబేద్కర్ సర్కిల్‌లో టిడిపి శ్రేణులు, కురువలు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కురువ సంఘం నాయకులు జయరాం, దేవేంద్రప్ప, టిడిపి నాయకులు నర్సప్ప, సురేంద్ర, నారాయణ మాట్లాడారు. టిడిపి కర్నూలు ఎంపీ అభ్యర్థిగా పంచాలింగాల నాగరాజుకు సీటు ఇచ్చినందుకు టిడిపి అధిష్టానానికి, చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు వాల్మీకి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

హాలహర్విలో మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బిజెపి మండల అధ్యక్షులు బసవరాజు మాట్లాడారు. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీతో నాగరాజును గెలిపించుకుంటామని తెలిపారు. నాగరాజు గెలుపు కోసం ప్రతి టిడిపి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఐటిడిపి మండల అధ్యక్షులు హనుమంతు రెడ్డి, వెంకటేష్, మంజు పాల్గొన్నారు.

వాల్మీకులకు రాంపురం రెడ్డి సోదరుల అండగా

- కోసిగి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా - టిడిపి అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డికి సవాల్
- ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షులు నరసింహులు, ఎంపిపి ఈరన్న

ప్రజాశక్తి - కోసిగి

మంత్రాలయం నియోజకవర్గంలోని వాల్మీకులకు రాంపురం రెడ్డి సోదరులు అండగా నిలిచారని ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షులు ఎన్.నరసింహులు, ఎంపిపి ఈరన్న తెలిపారు. శుక్రవారం కోసిగిలోని నాడిగేని నరసింహులు ఇంటి వద్ద వాల్మీకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కోసిగిలో టిడిపి అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి రాంపురం రెడ్డి సోదరుల గురించి, మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ మోహన్ రెడ్డి గురించి అనాలోచిత మాటలతో వాల్మీకులను రెచ్చగొట్టడం తగదని తెలిపారు. రాంపురం రెడ్డి సోదరుల కృషితోనే మీ కుటుంబానికి జిల్లా స్థాయి పదవి కట్టబెట్టిన విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. తాము ఏనాడూ చేతులు కట్టుకొని నిలబడలేదని, తమకు గౌరవం ఇచ్చి పక్కన కూర్చోబెట్టుకుంటారని తెలిపారు. పదవిలో ఉన్న తమను కాదని మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ మోహన్ రెడ్డి, ఏనాడూ స్వంత నిర్ణయాలను తీసుకోలేదని చెప్పారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, యువనేత వై.ధరణీ రెడ్డి, మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ మోహన్ రెడ్డి సహాయ, సహకారాలతో కోసిగి, మండలంలోని గ్రామాల అభివృద్ధికి బాటలు వేశారని తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పాలనలో కోసిగి అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని రాఘవేంద్ర రెడ్డికి సవాల్ విసిరారు. గత పాలకుల కంటే వాల్మీకులకు పదవుల ఇవ్వడంలో పెద్దపీట వేశారని, బీసీలకు టిక్కెట్ వచ్చిందని వాల్మీకుల మధ్య తగవులు పెట్టడం తగదని తెలిపారు. బీసీలు అధికంగా ఉన్న నియోజకవర్గంలో గత మూడు పర్యాయాలుగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి అండగా నిలబడి, గెలిపించుకున్న ఘనత తమదని చెప్పారు. ఈసారి కూడా తామంతా ఐక్యంగా ఉండి, మరోసారి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని గెలిపించుకోవడం ఖాయమని తెలిపారు. మాజీ ఎంపిపి ఎన్.భీమక్క, ఎన్.నాగరాజు, కాల్వ కోరవంజమ్మ, వందగల్లు లక్ష్మయ్య, ఎన్.వీరారెడ్డి, చిర్తనకల్లు ఈరన్న, నేలకోసిగి లక్ష్మన్న, మూగలదొడ్డి సోమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

బహిరంగ ప్రకటన

యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా, మాధాసు తిరుమలేష్, తండ్రి. మాధాసు తిమ్మప్ప, ఇంటి నెం 49-50ఎ-87-ఎ3-11, లక్ష్మీగనర్, గౌసియా కాంప్లెక్స్ వెనుక, కర్నూలు సిటీ, కర్నూలు జిల్లా నందు ఉండే ఇతను 12-10-2022 వ తేదీన ప్లాట్ నెంబరు 9 ని జక్కుల స్వామి రెడ్డి, తండ్రి. జె.రామిరెడ్డి, ఇంటినెం.49-1-87-బి1, మద్దూరు నగర్, కర్నూలు సిటీ వారి నుండి డాక్యుమెంట్ నెంబరు 15826/2022 ద్వారా కొన్నారు. దానికి సంబంధించిన లింకు డాక్యుమెంట్ నెం.176/1991 ను అతను లక్ష్మీనగర్ నుండి సి.క్యాంప్ కు బైకుపై పోవుచుండగా పోగోట్టుకోవడం జరిగినది. ఆ విషయమై అతను కర్నూలు 3వ పట్టణ పోలీస్ స్టేషన్ నందు కంప్లయింట్ ఇవ్వడం జరిగినది. కర్నూలు 3వ పట్టణ పోలీసు వారు అన్ని విధములుగా ఎంక్వయిరీ చేసి డాక్యుమెంట్లు దొరకలేదుఅని 16-03-2024 వ తేదీన సర్టిఫికెట్ ఇవ్వడమైనది. అతను ఆ ప్లాటు నందు LIC Housing Finance ద్వారా ఇంటి నిర్మాణము చేసినాడు. ఇప్పుడు అతను LIC Housing Finance నుంచి SBI, RASMECC, KURNOOL & Take over చేసుకోవాలని అనుకుంటున్నాడు. కావున పై తెలిపిన లింకు డాక్యుమెంటుకు సంబంధించి ఎవరికైన ఆక్షేపణలు ఉన్న యెడల 15 రోజుల లోపల క్రింద తెలిపిన అడ్రస్సుకు గాని లేదా సెల్ నెంబరుకు గాని తెలుపవలెను. లేని యెడల ఎటువంటి ఆక్షేపణలు లేవు అని భావించబడును.

షెడ్యూలు :- కర్నూలు డి. కర్నూలు సబ్.డి. కర్నూలు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియాకు చెందిన .49వ వార్డు, మిల్క్ వెండర్స్ కాలనీ, కల్లూరు సర్వే నెం. 781జి/1 & 2, ఇంటి నెం.49/50ఎ-87బి-3-6ను ప్లాట్ నెం.9లో నిర్మించిన ఇంటికి చెక్కుబంది.
తూర్పు : ప్లాట్ నెం. 10
పడమర : సర్వే నెం. 781జి/1&2లోని భూమి
ఉత్తరం : 20 అడుగుల వెడల్పు గల రోడ్డు
దక్షిణం : ప్లాట్ నెంబరు 13.
మొత్తం విస్తీర్ణం 110 చ.గజాలు.

కె.వెంకటేశ్వర్లు, అడ్వకేటు,
డోర్ నెం.40-837-సి,
యస్.బి.ఐ.మెయిన్ బ్రాంచ్ దగ్గర, కర్నూలు.
సెల్ నెం. 9440245022.